## క్లుప్తంగా

### ఆకట్టుకున్న విద్యార్థుల నమూనా పార్లమెంట్



**తెనాలిఅర్బన్:** బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో శనివారం నమూనా పార్లమెంట్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థినీ విద్యార్థులు పార్లమెంట్ సభ్యుల వలే హుందాగా వేదిక వద్దకు వచ్చి వివిధ హోదాల్లో ప్రజా ప్రతినిధులు వ్యవహరించే తీరును కళ్లకు కట్టినట్లు చూపించారు. కార్యక్రమాన్ని మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, పలువురు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

### అలరించిన అన్నమయ్య సంకీర్తనార్చన



**తెనాలిటౌన్:** పట్టణ వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అన్నమయ్య సంకీర్తనార్చన జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆదేశాల మేరకు తెనాలిలోని శ్రీ వెంకటేశ్వర -అన్నమాచార్య సంకీర్తన బృందం సభ్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అద్భుత సంకీర్తనా గానం చేశారు. బృందం గురువు కొండపి వసుంధరతో పాటు సభ్యులు లలితకుమారి, వాసవి, లక్ష్మీకుమారి, వినతి, రాజేశ్వరి, యశస్విని, బైరాగి, మహేష్, తన్మయలతో 35 మంది సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమాన్ని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, అందె బాల చంద్రమౌళిలు పర్యవేక్షించారు.

### ఎంసెట్ నమూనా పరీక్షకు స్పందన



**తెనాలిఅర్బన్:** ప్రకాశం రోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్‌లో శనివారం ఎంసెట్ పరీక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. మంచి మార్కులు సాధించిన వారికి స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ జెట్టి విజయశేఖర్, అధ్యాపకులు అమిరిశెట్టి శ్రీధర్, శ్రీనివాస్, ఉమాదేవి, లావణ్య, కోటి, ఎబినైజర్ పాల్గొన్నారు.

### 3న ఉచిత సామూహిక ఉపనయనాలు

**గుంటూరు మెడికల్:** బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 3న ఉచిత సామూహిక ఉపనయనాలు చేస్తున్నట్లు సేవాసమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ చెప్పారు. ఈమేరకు శనివారం స్థానిక బ్రాడీపేటలోని సేవాసమితి కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఉపనయనాలు చేయించుకునే వారు మార్చి 25న సాయంత్రం లోపు బ్రాడీపేట 1వలైనులోని బ్రాహ్మణ సేవాసమితి కార్యాలయంలో వటువు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. కేవలం బ్రాహ్మణులకు మాత్రమే ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కమిటీ కన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ 9440041241, కమిటీ కార్యాలయం 7013256879 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు పొత్తూరి మురళీ మోహన్‌రావు, వి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### నేడు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

**గుంటూరు మెడికల్:** సుదర్శిని కంటి ఆసుపత్రి, సుదర్శిని ఐ అండ్ విజన్ అసోసియేషన్ ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ప్రముఖ కంటి వైద్య నిపుణులు, సుదర్శిని కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ గణేశుని రాజేష్ తెలిపారు. స్థానిక పాతగుంటూరు యాదవ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతోందన్నారు. భారతదేశంలోనే అత్యాధునిక పరికరాలతో కూడిన సంచార కంటి ఆసుపత్రి బస్సులో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామన్నారు. కంటి శుక్లాలు, పొరలు, నీటి కాసులు, నల్లగుడ్డు సమస్యలు, బీపీ, షుగర్ వల్ల వచ్చే డయాబెటిక్ రెటినోపతి, ఇతర కంటి సమస్యలకు ఉచితంగా వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తారన్నారు. ఇతర వివరాలకు 9395561919, 9885322617 నంబర్లకు సంప్రదించాలన్నారు.

### పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

**నెహ్రూనగర్:** వడ్డీ లేకుండా పన్ను చెల్లింపులకు వీలుగా సెలవు రోజులైన ఆది, సోమ వారాల్లో కూడా యథావిధిగా నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పన్ను బకాయిపై వడ్డీ జమ అవ్వడంతో పాటు, పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- పేదలకు ఖరీదైన వైద్యం అందివ్వటమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు
- అర్బన్ హెల్త్ సెంటర్ సేవలతో సర్వత్రా హర్షాతిరేకాలు
- గర్భిణులకు ఉపయుక్తంగా మారిన అల్ట్రా సౌండ్ స్కానింగ్



అయితానగర్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్



అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తున్న డాక్టర్ మౌనిక

**తెనాలిఅర్బన్:** తెనాలి అయితానగర్ నేలపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ పేద ప్రజలకు ఎంతో చేరువైంది. ఆ ప్రాంతంలోని పేద ప్రజలు అక్కడికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేసిన అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలను గర్భిణులు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. దీనికోసం జిల్లా వైద్యశాలకు వెళ్లి చూపించుకునే ప్రయాస వారికి తగ్గింది. తెనాలి పట్టణ పరిధిలోని 1,2,3,35,36,37, 38,39,40 వార్డుల పరిధిలోని పేద ప్రజలకు అందుబాటులో వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గంగానమ్మపేటలోని ఓ అద్దె భవనంలో డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను జూన్2021లో ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఇక్కడ రోగులకు వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. ఇక్కడ 64 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 175 రకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయి.

**రూ.1.10 కోట్లతో నూతన భవనం**

అర్బన్ హెల్త్ సెంటర్‌ను శాశ్వత భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించి అందుకు అనవరమైన చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా అయితానగర్ నేలపాడు రోడ్డులో దీని నిర్మాణం కోసం అధికారులు స్థలం కేటాయించారు. అంతేకాకుండా దాని నిర్మాణం కోసం రూ.1.10 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. వెంటనే దాని నిర్మాణ పనులు అధికారులు ప్రారంభించి పూర్తి చేశారు. ఈనెల 12న అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించటంతో ప్రస్తుతం ఇక్కడే వైద్యశాల సేవలు కొనసాగుతున్నాయి.

**ఏడాదికి పది వేల మందికి వైద్య సేవలు**

అయితానగర్‌లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నేడు రోజుకు సగటున 30 నుంచి 40 మంది వరకు ఇక్కడ సేవలు పొందుతున్నారు. ఏడాదికి సుమారు పది వేల మంది వైద్య సేవలు పొందుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ ఏర్పాటు చేసిన రక్త, మూత్ర, కళ్లె పరీక్షలను నెలకు సుమారు మూడు వందల మందికి పైగా చేయించుకుంటున్నారు. ఏడాదికి సుమారు నాలుగు వేల మంది ఇక్కడ వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

**గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలు**

అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో తొమ్మిది వార్డులు ఉన్నాయి. వీటిలో నివసించే గర్భిణులకు సేవలందించేందుకు పది మంది ఏఎన్ఎంలను ప్రభుత్వం నియమించింది. వారు ఆయా వార్డులలో నివసించే గర్భిణులను గుర్తించటం వారికి ప్రతినెల చెకప్‌లు చేయించటం వంటివి చేస్తుంటారు. అలాగే వారిలో ఇతర సమస్యలు ఏమైన ఏర్పడితే అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంటారు. అలాగే గర్భిణీలకు అవసరమైన అల్ట్రా సౌండ్ స్కానింగ్‌ను ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేసింది. సాధారణంగా గర్భిణులు స్కానింగ్ కోసం జిల్లా వైద్యశాల ఆవరణలోని తల్లిపిల్లల వైద్యశాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం ఈ కేంద్రంలో దానిని ఏర్పాటు చేయటం వల్ల గర్భిణులు ఇక్కడికే వచ్చి వాటి సేవలు పొందుతున్నారు. దీనివల్ల ఎంతో ఆర్థిక భారం, ప్రయాస తగ్గినట్లు అయ్యింది.

### షుగర్, బీపీ, టీబీకి చికిత్స పొందుతున్నా



నేను షుగర్, బీపీతో కొంత కాలంగా బాధపడుతూ ఉన్నాను. వీటి చికిత్స కోసం ఇక్కడికి ఏడాది నుంచి వస్తున్నాను. ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది మాకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నారు. చెకప్‌కు వచ్చిన వెంటనే పరీక్షలు చేయించి అవసరమైన మందులు ఇస్తున్నారు.

–బి రమాదేవి, అయితానగర్, తెనాలి.

### వైద్యులు, సిబ్బంది సేవలు బాగున్నాయి



నాకు షుగర్, బీపీ ఉంది. వాటి చికిత్స కోసం ప్రతినెల ఇక్కడికి వస్తున్నాను. ఇక్కడి వైద్యులు, సిబ్బంది రోగులు వచ్చిన వెంటనే వారికి అవసరమైన పరీక్షలు చేస్తున్నారు. అలాగే రిపోర్ట్‌లు త్వరగా ఇవ్వటంతో పాటు అవసరమైన మందులు కూడా ఇస్తున్నారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది అందించే సేవలు బాగున్నాయి.

–కన్నెగంటి మల్లికార్జునరావు, అయితానగర్, తెనాలి.

### అల్ట్రా సౌండ్ స్కానింగ్ సేవలతో డబ్బు ఆదా



నేను అయిదో నెల గర్భిణీని. నేను గర్భం దాల్చిన నాటి నుంచి ఇక్కడికి రెగ్యులర్‌గా వచ్చి చెకప్ చేయించుకుంటున్నాను. ఇక్కడ వైద్యులు అవసరమైన సమయంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్‌ను చేసి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. స్కానింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయటం వల్ల మాలాంటి గర్భిణీలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. దూర ప్రాంతాలకు వెళ్లి డబ్బు పోగొట్టుకునే బాధ తప్పింది.

–జి మౌనిక, అయితానగర్, తెనాలి.

# ఓటు హక్కు వినియోగంపై అలసత్వం వద్దు

మున్సిపల్ కమిషనర్ శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

**తెనాలిఅర్బన్:** ప్రతి ఒక్కరూ రాబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమాన్ని ఉడా కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, డబ్బు, ఎటువంటి ప్రలోభాలకు లోనుకుండా నిర్భయంగా, నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పట్టణంలోని 151 బూత్‌లలో ఎన్నికలు జరగనున్నాయని ఓటు వినియోగించుకునే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉందని వాటిని ఎవరూ అతిక్రమించవద్దని సూచించారు. అలా చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అసిస్టెంట్ కమిషనర్ అనూష మాట్లాడుతూ నో యువర్ క్యాండెట్, పోలింగ్ సెంటర్ వివరాలను తెలుసుకునేందుకు ఎన్నికల కమిషన్ అనేక యాప్‌లను రూపొందించిందని తెలిపారు. యువత తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ తిరునాళ్ల ప్రారంభం



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**తెనాలిటౌన్:** పట్టణ బాలాజీరావుపేటలోని అయ్యప్ప ప్రధాన దేవాలయంలో దుర్గమ్మ తిరునాళ్ల శనివారం ప్రారంభమైంది. దుర్గమ్మ తల్లి మహిళా మండలి భక్త బృందం ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపకులు దుర్గా హరిబాబు స్వామి పర్యవేక్షణలో తిరునాళ్లు జరుగుతున్నాయి. అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, భక్తులు విశేషంగా పూజలు జరిపారు. ఆదివారం ఉదయం పాల పొంగళ్లు, పసుపు గౌరి దర్శనం ఉంటుంది. 10 గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని తెలిపారు. కూచిపూడి భరత నాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయని హరిబాబుస్వామి తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ జరుగుతుందని చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

# క్షయ వ్యాధిపై అవగాహన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు

**తెనాలిఅర్బన్:** క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ పావని ప్రియాంకలు సూచించారు. ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని జిల్లా వైద్యశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. క్షయ బారినపడిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసే కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ మూర్తి, డాక్టర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ రంగంలో విస్తృత అవకాశాలు

- ప్రొఫెసర్ ఎస్.రామచంద్ర శెట్టి
- హిందూ ఫార్మసీ కళాశాలలో సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామచంద్రశెట్టి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఫార్మసీ రంగంలో విద్యార్థులకు విస్తృత అవకాశాలున్నాయని బెంగుళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.రామచంద్రశెట్టి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ''ఫార్మసీ వృత్తి పరిణామం–ప్రస్తుత స్థితి'' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రశెట్టి మాట్లాడుతూ బల్క్‌డ్రగ్, వ్యాక్సిన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, పరిశోధనల్లో చోటు చేసుకున్న నూతన పరిణామాలను గురించి వివరించారు. కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పరిశోధనలు, నూతన ఔషధాల ఆవిష్కరణల దిశగా కళాశాలలు, వివిధ విశ్వ విద్యాలయాలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవాలని అన్నారు.

సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ దేసు బ్రహ్మ శ్రీనివాసరావు, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యాలయంలో భగత్‌సింగ్‌కు నివాళి



శివాజీచౌక్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**తెనాలిఅర్బన్:** దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం అసువులు బాసిన మహనీయుడు సర్దార్ భగత్‌సింగ్ అని ది కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు కొనియాడారు. గాంధీనగర్‌లోని ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకులు పి.పోలేశ్వరరావు, సభ్యులు ఎం.తిరుమలరావు, టి.పోతురాజు, ఎల్.పూర్ణచంద్రరావు, ఏడీజీ ప్రసాద్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శివాజీచౌక్ వద్ద శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో నేటి యువత ముందుకు నడవాలని తెలిపారు. అతి చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కుంభ రవితేజ, బిళ్ల రాజేష్, సీపీఐ సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోలా శేఖర్, గండు శివ, చెన్నూరు సాయి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

**భగత్‌సింగ్ చూపిన బాటలో నడుద్దాం**

**తెనాలిటౌన్:** స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్ సింగ్ వర్ధంతిని బీజేపీ నాయకులు శనివారం జరిపారు. శివాజీచౌక్‌లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు కుశల్‌రాజ్ జైన్, దారా సాయిగుప్త, శిఖా రవీంద్ర, తుమ్మలసాయి, టి.వెంకటేశ్వరరావు, కోడూరి వెంకట్రావు, తన్నీరు శివశంకర్, దుర్గాభవానీ, డి.హనుమంతరావు, ప్రభంజనరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



14వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక

**తెనాలిఅర్బన్:** సంక్షేమ పాలన రాష్ట్రంలో కొనసాగాలంటే మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగవేణి, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, కొమ్మురబత్తిన జయపాల్, మాజీ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ రేహమ, చుండూరు సాయి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

**తెనాలిరూరల్:** ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని టూ టౌన్ సీఐ ఏ.సుధాకర్ ప్రజలకు సూచించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు తెనాలి టూటౌన్ పోలీసులు ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూలులో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి భయాందోళనకు లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు పల్లె నిద్ర కార్యక్రమాన్ని పోలీసు శాఖ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం హైస్కూలు ఆవరణలో నిద్రించారు.

### ఐదు నెలల తరువాత తల్లి ఒడికి చేరిన శిశువు



శిశువును తల్లికి అప్పగిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్‌లో బరువు తక్కువగా ఉందని శిశువును వదిలి వెళ్లిన తల్లి ఒడిలోకి ఐదు నెలల తరు వాత శిశువును చేర్పించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఐదు నెలల పాటు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సదరు శిశువు ఆలనా, పాలనా చూసుకున్నట్లు వెల్లడించారు. గత ఏడాది అక్టోబరు 21న అలేఖ్య జీజీహెచ్‌లో ఆడ శిశువును ప్రసవించిందన్నారు. బరువు తక్కువగా ఉండటంతో అలేఖ్య సహాయకురాలు లక్ష్మీ పిల్లల వైద్య విభాగానికి శిశువును తీసుకొచ్చిందన్నారు. చిన్న పిల్లల వైద్యులు శిశు ఆరోగ్య పరిస్థితి గురించి కౌన్సిలింగ్ ఇచ్చే సమయంలో లక్ష్మిని పిలువగా ఆమె వైద్యులకు సమాచారం ఇవ్వకుండా శిశువును వదిలి ఆసుపత్రి నుంచి వెళ్లిపోయిందన్నారు. శిశువు తల్లి రాకపోవడంతో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అక్టోబరు 21 నుంచి ఐదు నెలలపాటు తల్లి శిశువు వద్దకు రాకపోవడంతో పిల్లల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది శిశువు ఆలనా పాలనా చూసుకున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు ద్వారా శిశువు తల్లిని గుర్తించి కొత్తపేట పోలీసులు ఆమె నరసరావుపేటలో ఉన్నట్లు విచారణలో తెలుసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. పోలీసుల సమక్షంలో శిశువును తల్లికి అప్పగించామన్నారు.

### గంజాయి స్వాధీనం

**పట్నంబజారు:** గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. వ్యసనాలకు బానిసగా మారిన తేలూరి దశరథరామిరెడ్డి నల్లచెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో వ్యసనాలకు బానిసగా మారి గంజాయి విక్రయించేందుకు నిర్ణయించుకున్నాడు. గుంటూరు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో భారీగా గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు మణిపురం ఓవర్ బ్రిడ్జి కింద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మూడు కిలోల గంజా యిని స్వాధీనం చేసుకున్నారు. ప్రతిభ కనబర్చిన ఎస్సై కె.తరంగిణి, ఏఎస్సై ఎం.ఆంథోని, హెడ్‌కానిస్టేబుల్ నక్కా రవి, కానిస్టేబుల్ కోటేశ్వరరావులను ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిషికేష్ షలేకే అభినందించారు.

### నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు

**పట్నంబజారు:** ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ ద్విచక్ర వాహనంపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉన్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో నెహ్రూనగర్‌లో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో అతని వాహనంపై పవన్ కల్యాణ్ ఫొటో ఉంది. దీన్ని గమనించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నంబరు 5 అధికారి జి.సురేష్, సిబ్బంది నిలువరించగా, తన వాహనం వదిలి సదరు వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### వైభవంగా ఆలయ వార్షికోత్సవం

**పాత గుంటూరు:** వస్తనగర్‌లో వేంచేసియున్న పద్మావతి గోదాదేవి సమేత కామ్యసిద్ధి వెంకటాచల స్వామి దేవస్థానం అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ 9 వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం సుప్రభాత సేవ, ప్రాతః కాలార్చన, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాసన, అగ్నిధ్యానములు, నిత్యహోమం బలిహరణ, ధ్వజారోహనం, కుంబార్చన, హారతి, కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం, నవగ్రహఆరాధన, అగ్నిధ్యానములు నిత్యహోమం, బలిహరణ, నవగ్రహహోమం, కుంభార్చన, హారతి తదితర పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి ఎం.వి.శేషగిరిరావు, కమిటి సభ్యులు పర్యవేక్షించారు. వస్తనగర్ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### ముగియనున్న డ్వాక్రా బజార్

**నెహ్రూనగర్:** డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్(డ్వాక్రా బజార్) రేపటితో ముగియనుందని రాష్ట్ర చేనేత ఉత్పత్తుల కమిటీ సభ్యురాలు, డ్వాక్రా బజార్ నిర్వాహకురాలు కోట దేవకీదేవి కోరారు. బృందావన్‌గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌లో శనివా రం స్టాల్స్‌ను ఆమె సందర్శించి మాట్లాడారు. డ్వాక్రా బజారు ఈ నెల 25వ తేదీతో ముగియ నుందని చెప్పారు.